# కలిసొచ్చిన అదృష్టం!

కృషి వుంటే మనిషి 'రుషి' అవుతాడనేది కాళిదాసు విషయంలో నిజమై రుజువైంది!

రోగినాడి చూచి వైద్యం చేసినట్టు తాను రాసిన కథ... నవల... 'ఏదైనా సరే' ఏ పత్రికకు పంపితే అచ్చుకు నోచుకుంటుందో అవలీలగా చెప్పగల సమర్థుడు కాళిదాసు!

కాళిదాసు అల్లాటప్పారైటరేం కాదు. సరుకున్నోడు! అభినవ కాళిదాసే! నిరంతర కృషీవలుడు! అలనాటి గొర్రెలు కాపరికి అతని నాలుకపై అమ్మవారు బీజాక్షరాలు రాస్తే... నేటి కాళిదాసు ఆదేవుడు నుదుటి మీద రచయిత కమ్మని రాశాడో ఏమో అచిర కాలంలోనే మంచి పాపులారిటీ సాధించాడు రైటర్‌గా!

సాహిత్యపు తీరు తెన్నులను కరతలామలకం చేసుకుని అన్ని యాంగిల్స్‌లో ఔపోసన పట్టిన ప్రతిభాశాలి కాళిదాసు.

నేటి సుప్రసిద్ధ రచయిత కాళిదాసు అలనాటి మహాకవి కాళిదాసుకేం తీసిపోడు. అచిర కాలంలోనే ఇటు రాష్ట్ర అటు కేంద్ర సాహిత్య అకాడమీ వారి చేత ఇతగాని కథా సంపుటి నవలకు బహుమతులు స్వీకరించాడు.

అసంఖ్యాకంగ కథలు నవలలు రాస్తూ పాపులర్ అయినాడు. కాళిదాసు రచనలు అనేక ఇతర భాషల్లోకి అనువదింపబడటం మరో విశేషం!

పెళ్లికి పూర్వం రచనావ్యాసంగం ఒంటెద్దు పోకడగా సాగినా శ్రీమతి ఇంట్లో కాలిడిన మరుక్షణం నుండీ మేరువైనాడు. అదే లక్కంటే! గొడ్డొచ్చిన వేళ... బిడ్డొచ్చిన వేళ సామెత లాగ ఇతడికి భార్య మెడలో మూడు ముళ్లు వేసిన నాటి నుండి యమస్పీడుగ రచయితగ వున్నత శిఖరాలను అధిరోహించే అదృష్టం కలిసొచ్చింది.

అమ్మవారు అలనాడు గొర్రెల కాపరి నాలుక మీద బీజాక్షరాలు రాసేక మహాకవి అయినట్టే పెళ్లాం ఇంట్లో కాలు పెట్టాక ఈ కాళిదాసు రచనావ్యా సంగంలో వెనక్కి తిరిగి చూడాల్సి అవసరం లేకపోయింది.

కాళిదాసు ఎలాంటి రచన అయినా పాఠకులను విశేషంగా అలరిస్తుంది. సంభ్రమాశ్చర్యాలో ముంచెత్తేస్తుంది. గుండెలు పిండేస్తయ్! పొట్ట చక్కలయ్యేట్టు

మరికొన్ని అలరిస్తయ్. అదీ అతని పెన్ (బాల్‌పెన్ను) కున్న పవర్!

నేతలు పార్టీలను మార్చినట్టు కాళిదాసు రాసే కలాలను మార్చడు! పాతబడినా సరే అచ్చొచ్చిన కలాన్నే అత్యంత ఆప్యాయంగ... విడిచి పెట్టకుండా వాడుతూనే వున్నాడు. ఎవరికీ ఆకలాన్ని ధారా దత్తం చేయమనస్కరించదు. అవతల విసిరేయటానికి అంతరాత్మ అంగీకరించదు.

పశువులు తిన్నదాణాని నెమరేసినట్టు మస్తిష్కంలో మెదలాడే ఆలోచన్లకు నిరంతరం పదును పెడుతూనే వుంటాడు కాళిదాసు. ఐడియా తట్టగానే కలం కాగితం తీసుకుని కక్కేయడు. బ్రైన్‌లోనే ఫిల్టర్ చేస్తాడు. మనసులోనే మధిస్తాడు. పాకానికొచ్చాక రాయటం మొదలుపెడతాడు.

ఒకే వక్క సిటింగ్‌లో అరగంట వ్యవధిలో పది పేజీల కథను అలవోకగా రాసేయగల దిట్ట! అంతటి సమర్థుడు.

అనేక పత్రికలు ఏటా నిర్వహించే అనేక కథ... నవలల పోటీల్లో అనేకానేక సార్లు బహుమతులు సొంతం చేసుకున్న ఘనత కాళిదాసుకేదక్కింది.

అతనికో సర్కిలుంది! ఫాలోయింగ్ వుంది! శిష్య వర్గం వుంది! నాలుగైదు పత్రికల్లో అతని నవలలు ఒకేసారి సీరియలైజ్ అయిన సందర్భాలు కోకొల్లలు! కంప్యూటర్ రైటర్ అని ఫ్రండ్స్ అంతా ముద్దుగా పిలుస్తూంటారు.

శతాధిక గ్రంధ కర్త కాళిదాసు! సన్మానాలు పురస్కారాలకేం కొదువలేదు. ఇంట్లో బీరువా నిండా శాలువాలే!

షెల్ఫ్ నిండా జ్ఞాపికలే! రచనా ప్రవీణ... సాహిత్య రత్నవంటి బిరుదులెన్నో అతని ఖాతాలో జమైనయ్.

బీదలకు... అనాథలకు... తన వద్దగల శాలువలను ఉదారంగ దానం చేసి వారి అవసరం తీర్చటం కాళిదాసుకో అలవాటు!

కళ్లు మూస్తే కథ... తెరిస్తే కథ... బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుంటేనూ బోలెడన్ని థాట్స్ స్ఫురిస్తయ్. పాయింట్ ఎక్కడ మిస్సవుతుందోని వంటి నున్న తడి తుడుచుకోకుండానే టవల్ చుట్టుకునొచ్చి మదిలో ఆలోచనకు అక్షర రూపం ఇస్తూంటాడు. భోజనం చేసేటప్పుడూ అంతే! ముగియకుండానే ఎంగిలి చేత్తో రాత మొదలుపెడతాడు. తిరిగి వెళ్లి భోజనం చేయటం పూర్తి అయిన తర్వాత చెయ్యి

కడుక్కోవటం! చాలామంది రైటర్స్ కుండే పెక్యూలియర్ హేబిట్స్ కాళిదాసుకీ వున్నయ్!

మిమ్మల్నీ మీ వ్యవహారం చూచిన ఎవరైనా మీకు మెంటల్ అనుకోక మానరు... అని శ్రీమతి అంటే... రచయితలు ఇంతే! దేన్నీ కడపులో వుంచుకోరు. వేవెళ్ల ఆడదానిలా వాంతి చేసుకోక తప్పదు... కాళిదాసు చమత్కరించటం ఇంట్లో నవ్వులు పండిస్తుంది.

ఆఫీసులో ఉద్యోగం నిర్వహిస్తున్నప్పుడూ అంతే! ఫైలు స్టడీ చేస్తున్నప్పుడో... నోట్ ప్రిపేర్ చేస్తున్న సమయంలోనో ఐడియా వచ్చిందంటే చాలు... చేస్తున్న పని ఆపి నాలుగు తెల్ల కాగితాలు తీసుకుని ఏక ధాటిక రాయటానికి వెనుకాడడు!

× × × × ×

ఒకరోజు నిద్రకుపక్రమిస్తూ... 'ఇదిగో శ్రీమతీ... నేను చచ్చిపోతే కట్టెల ఖర్చుండదు తెలుసా? రచనల తాలూకు రాత ప్రతులు పేర్చి నన్ను తగలేయచ్చు! అప్పుడు నా ఆత్మ శాంతిస్తుంది. జన్మ చరితార్థమౌతుంది...'

ఆ మాటలకు ఉలిక్కిపడి 'ఏమిటి అపసవ్యం మాటలు? సరదాకైనా అలా మాట్లాడకండి! నాలుగు కాలాల పాటునన్ను పసుపు కుంకాలతో వుండనీయండి....' నొచ్చుకుని బాధపడింది.

'ఇంతకుమించిన 'జోక్స్' మరేముంటయ్యోయ్ మనమధ్య?-'

'ఇది జోకా?- చాల్లెండి మీ సమర్థింపు! కళ్లు మూసుకు నిద్రపోండి...'

'ఎందుకోయ్ నీకంత భయం? సెంచరీకొట్టనిదే కన్ను ముయ్యన్లే...'

'కాస్త ఆపుతారా మీ ఎకచక్కాలు? అందునా రాత్రిళ్లు... నిద్రపోయే వేళప్పుడు... ఇలా మాట్లాడతగునా...?'

శ్రీమతికి కోపం వచ్చిందని గ్రహించి కిక్కురుమనకుండా కళ్లు మూసుకుని నిద్రకుపక్రమించాడు.

తెల్లారి పేపర్ చూస్తూ సీట్లో కూర్చున్న కాళిదాసుకి 'సార్... సార్' అంటూ ఎవరో పిల్చినట్టన్పించింది పేపర్లోంచి తలని వీధి వాకిలివైపు మరల్చాడు.

ఆ వచ్చింది కొత్త శాల్తీలాగవుందే అన్పించింది.

జటప్లేన్లాగ లోపలి కొచ్చి 'నా పేరు అవతారం అండీ ఈవూరికే కాదు

కాలనీకి కొత్తే! వీధిలో చివరింట్లో అద్దెకు దిగాను. శ్రీకాకుళం నుండి బదిలీ అయింది. నేనో కథల బిచ్చగాడిని!... ఛఛ... కాదు కాదు పిచ్చోడిని! ఎప్పుడైనా బుద్ధిపుట్టినపుడు చేతి వేళ్లు జిల పుట్టినప్పుడు.. బుర్రలో వున్న థాట్ కరక్టేనన్పించినపుడు... అప్పుడు మాత్రమే కథ రాస్తుంటాను. తమరి ఇల్లు మా వీధిలోనే అని కొలీగ్స్ చెప్పారు. సన్డే కదాని దర్శనం కోసం వచ్చాను...'

గడగడాపాఠం వప్పగించినట్టు... ఓ ఛోటా నాయకుడు ఉపన్యసించినట్టు మాట్లాడటం చూచి ఇతగాడిలో ఓ బుల్లి నటుడు సైతం వున్నాడు సుమా... అనేసి మనసునలో అనుకుంటుండగానే... ఆ వచ్చిన అవతారం సాష్టాంగపడటం చూచి అసంకల్పిత చర్యకు కాళిదాసు నిర్ఘాంతపోయాడు.

'నీదీ మా కులమేనన్నమాట...' నవ్వేడు కాళిదాసు

పెద్దాయనలోని నిరాండబరత... ఆప్యాయత చూచి సంబరపడిన అవతారం లేచి 'మీరు చతురులు... చమత్కారులు! మీ శిష్యరికం చేద్దామనోచ్చాను.' కాళిదాసు కూర్చోమన్న కంటి సైగను గ్రహించి అక్కడున్న మరో ఛైర్లో గౌరవభావం పుట్టిపడేట్టు గువ్వలాముడుచు కూర్చున్నాడు అవతారం!

'రచనా వ్యవసాయంలో గురు శిష్య సంబంధాలుండవ్. ఈ క్షేత్రంలో పెద్దా చిన్న తేడాలేని హాలి కులమే అందరం...'

ఇంతలో మేడమ్ కాఫీ తెచ్చి అందించి వెళ్లింది!

'మీరు భీష్మాచార్యులు! నావంటి వాడు సైన్యంలో చిరు సైనికుడు!... ఓ నాలుగు ప్లాట్స్ అరువిద్దురూ...'

'ఇళ్ల స్థలాలు కావు అవతారం ఇతరులకివ్వటానికైనా.... అమ్మటానికైనా...'

'మొదటి కలయికలోనే మీ గుండె లోతులను అర్థం చేసుకోగలిగాను సార్!... తరచు కలుస్తూ వుంటాను...' కూర్చున్న వాడుల్లాలేచి నిలబడ్డాడు.

'ఎప్పుడైనా రావచ్చు... కలవచ్చు! కాకపోతే ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకుని బయల్దేరి రండి! ఎందుకంటే... మీరొస్తారని తెలిస్తే మీకోసం నిరీక్షిస్తానంతే!......'

మరోసారి నమస్కరించి అక్కడి నుంచి కదిలాడు అవతారం.

× × × × ×

అదే పనిగా మొబైల్ రింగ్ అవుతోంది.

'అబ్బా... ఎంత సేపు మీస్నానం? తెమిలి రండి. అవతల సెల్ రింగవుతోంది...' శ్రీమతి పెద్దగా అరిచి చెప్పింది.

'నువ్వు మాట్లాడవే! ఎవరో... ఏమిటో తెల్సుకో...' బాత్‌రూమ్‌లో నుండే బదులిచ్చాడు కాళిదాసు.

మొబైల్ అన్ చేసి మాట్లాడి విషయం తెల్సుకున్న తర్వాత ఆఫ్ చేసింది.

'ఎవరైనా పబ్లిషర్ ఫోన్ చేశాడా?' బాత్‌రూంలోంచి అరిచాడు.

కాదన్నట్టు తల అడ్డంగ ఆడించింది శ్రీమతి.

'రైటర్ ఫ్రెండ్ ఎవరైనానా?... పేరు కనుక్కున్నావా?'

'నో... నో... నో...!'

'వట్టినే వూరించకు. సస్పెన్స్‌తో ప్రాణం తియ్యక.. చెప్పు...' బైటికొచ్చి అడిగాడు.

'ఎంతో పెద్ద రచయిత అయివుండి మీరు ఆ మాత్రం ఊహించలేరా?'- మరికాస్త వుడికించింది మొగుడ్ని.

'నావల్ల కావటం లేదు. ఇదేమైనా కథా వూహించి రాసేందుకు?-'

'అయితే వినండి! నేనే చెప్తాను. త్వరలో మీకు లెటరొకటి రాబోతుంది..'

'అదేమైనా ప్రేమలేఖా?-'

'ఈ వయసులో మీకు అదొకటే తక్కువ...' ఎగతాళిగా మాట్లాడింది.

'కహానీలు ఆపి... పాయింట్‌కి రా...' దేవిని దగ్గరకు లాక్కుని కౌగిట్లో బంధించాడు కాళిదాసు.

'ఈ వయసులో ఇదేం పోకిరీ పని? దూరంగ వుండండి' వచ్చే నవ్వు ఆపుకో ప్రయత్నిస్తూ అంది.

'నా బుర్ర వేడెక్కుతోంది' భార్యకు దూరంగా జరిగాడు.

గలగలా పారే సెలయేరులా నవ్వింది.

'ఏడిపించింది చాలుగాని...'

భర్త మాట్లాడటం పూర్తి కాకుండానే 'మీరు త్వరలో ఢిల్లీకి వెళ్లనున్నారు

శ్రీవారూ...' సగం చెప్పింది.

'ఢిల్లీ నాకేం కొత్తకాదే. చాలాసార్లు వెళ్లొచ్చాను కదా?-'

'ఆ వెళ్లటం వేరు... ఇదివేరు...'

'వేరు కాదు... మొక్కా కాదు గానీ... విషయమేమిటో చేప్తావా లేదా?-' నొసలు చిట్లించాడు.

'తమరికి ఈ సంవత్సరం పద్మశ్రీ బిరుదుతో కేంద్రం సత్కరించబోనున్నదని ఫోన్‌లో చెప్పి వివరాలతో కూడిన లెటరొస్తుందని విన్నివించారు అవతలి వ్యక్తి...'

'నిజమా?' తన చెవులను తానే నమ్మ శక్యంకాలేక విస్తుపోయాడు కాళిదాసు.

'ఎందుకు అంత ఆశ్చర్యం! కొన్ని వందల రచనలు చేసిన ప్రముఖులు మీరు. మీకు ఈ అవార్డ్ ప్రభుత్వం ఇవ్వటం సముచితం... ఈ స్వీట్ న్యూస్ చెప్పినందుకు నాకేమిస్తారు?-'

'నువ్వు హాట్ కాఫీ ఇస్తే... నీకో స్వీట్ కిస్ ఇస్తాను...'

'మీకు ఒళ్లంతా చతురే... రచయితలు కదా?- రసికత్వం మీ సొంతం!...' పండగరోజు కూడా పాత మొగుడేనాని... ఇంత గొప్ప కబుర్లు చెప్పిన మీ అర్ధాంగిని వెంటనే ఏ స్టార్ హోటల్‌కో తీసుకెళ్లి డిన్నర్ ఇవ్వద్దూ?...'

'అంతేనా?- నీకు బెనారస్ పట్టు చీరె కొనిస్తాను. ఓ చంద్రహారం చేయిస్తాను. నువ్వు నా హృదయ సామ్రాజ్యానికి రాణివి కదా!?- నా జీవితంలోకి నువ్వొచ్చాకే కదా విజయపరంపరలను సొంతం చేసుకుంటున్నది... యువార్ గ్రేట్ డియర్. ఐ షుడ్ థ్యాంక్యూ...' శ్రీమతిని ఎత్తుకుని గిరగిరా తిప్పాడు.

'ఆపుదురూ... చిన్న పిల్లల్లా ఏమిటిది?- నాకు సిగ్గేస్తోంది...'

కాళిదాసు భార్యా సమేతంగ ఫైవ్ స్టార్ హోటల్లో డిన్నర్ చేసి టాక్సీలో ఇంటికి తిరిగొచ్చారు.

మరునాడే భారత ప్రభుత్వం నుండి 'పద్మశ్రీ' బిరుదు తనకు ఇవ్వబోతున్నారనే లెటర్ రానే వచ్చింది. ప్రదానం తారీఖు తెలిపరుస్తామన్నారు.

ఇకపై సీదాసాదా కాళిదాసు కాదు!... అతడు పద్మశ్రీ కాళిదాసు కానున్నాడు!!

(సమాప్తం)